జోరుగా కాంగ్రెస్ నేతల ప్రచారం



చీర్యాల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం జోరందుకుంది. సోమవారం చీర్యాల, కీసర, గోధుమకుంట తదితర గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల కృష్ణయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, చీర్యాల గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ నేత పద్మనాగభూషణం, కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి, మంచాల కిరణ్ జ్యోతిప్రవీణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తటాకం అభిలాష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలును తప్పకుండా అమలు చేయనున్నట్లు ఓటర్లకు తెలియజేస్తూ ప్రచారాన్ని ముందుకు సాగిస్తున్నారు. ఇక నాగారంలో మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాయిగూడలో వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ గోగుల సరితావెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం కొనసాగింది.

ఆశయం ఉన్న వారిని గెలిపించండి

బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



ఎదులాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రజలకు సేవలందించాలన్న ఆశయం ఉన్న వారిని గెలిపించాలని ఎంపీపీ, మేడ్చల్ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి అవుషాపూర్, అంకుషాపూర్, ఏదులాబాల్‌లో సోమవారం పార్టీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంపీపీగా పేదలకు తాను అందించిన సేవలు ఇంటింటికీ తిరిగి వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్‌ముదిరాజ్, నర్సింహారెడ్డి, దామోదర్‌రెడ్డి, చిరంజీవి, రఘు, రామోజీ తదిరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన వక్ఫ్‌బోర్డు జేఏసీ నేతలు



టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో జేఏసీ నేతలు

మేడ్చల్‌రూరల్: నాలుగేళ్లుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్, ఇతర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వక్ఫ్ బోర్డు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో కలిసి బోడుప్పల్ వక్ఫ్ జేఏసీ నేతలు రేవంత్‌రెడ్డిని కలిసి వక్ఫ్ బోర్డు భూ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే బీఆర్‌ఎస్‌కు వక్ఫ్ బోర్డు భూమి సమస్యలు గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. ఎన్నికలు ఉన్నాయని మంత్రి కేటీఆర్, మల్లారెడ్డి జేఏసీ ప్రతినిధులను పిలిపించుకుని సమావేశం ఏర్పాటు చేశారని, నాలుగేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గుర్తుకు రాని సమస్య ఎన్నికలప్పుడే ఎందుకు గుర్తుకొచ్చిందని, మల్లారెడ్డి ఓటమి భయంతోనే సమస్యపై ఏదో చేస్తున్నట్లు మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుల భూటకపు మాటలు ప్రజలు నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు కిషోర్‌గౌడ్, జేఏసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో బీజేపీ ఆఫీస్ ప్రారంభం



పార్టీ ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

పోచారం: భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి పోచారంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి కమలం గుర్తుకే ఓటు వెయ్యాలని కోరారు. అనంతరం గడపగడపకూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సురేష్ నాయక్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ జిమ్ అసోసియేషన్ సమస్యలను పరిష్కరిస్తా : మంత్రి కేటీఆర్



ఉప్పల్: తెలంగాణలో ఫిట్‌నెస్ పరిశ్రమ, జిమ్ ఓనర్స్ సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర మున్సిపల్, ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు హామీ ఇచ్చినట్లు తెలంగాణ జిమ్ ఓనర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు సోమవారం తెలంగాణ జిమ్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జయసింహ, ప్రధాన కార్యదర్శి పవన్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి సమస్యలను వినతి పత్రం ద్వారా తెలిపారు. ఆరోగ్య తెలంగాణ కావాలంటే అన్ని వయస్సుల వారికి ఫిట్‌నెస్‌పై అవగాహన అవసరమని వినతి పత్రంలో పేర్కొన్నారు. చాలా వరకు ఫిట్‌నెస్‌పై అవగాహన రావడం లేదని, అందుకు ప్రభుత్వం తరఫున అవగాహన, ప్రచారం చేసే అవకాశాలను కల్పించాలని కోరారు. ఫిట్‌నెస్ పరిశ్రమలను ఆదుకోవాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

మేడ్చల్‌లో గెలిచేది కాంగ్రెస్సే..



జవహర్‌నగర్ గౌడ సంఘం అధ్యక్షుడు రాజుగౌడ్‌ను ఆహ్వానిస్తున్న నక్క ప్రభాకర్‌గౌడ్

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్

మేడ్చల్ జోన్ బృందం: మేడ్చల్‌లో నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి ఎక్కడికి వెళ్లినా అతడి ధ్యాస భూములను ఆక్రమించుకోవడంలోనే ఉందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం జవహర్‌నగర్ గౌడ్ సంఘం అధ్యక్షుడు కారింగుల రాజుగౌడ్, జిల్లా నాయకుడు పల్లె క్రిష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీ శోభ, మాజీ వార్డు సభ్యుడు రామారావుల సమక్షంలో దాదాపు 1000 మంది నక్క ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ మేడ్చల్‌లో 10 ఏళ్లగా మంత్రి మల్లారెడ్డి నియంత పాలన కొనసాగిస్తున్నారని, మేడ్చల్‌లో ఎక్కడికి వెళ్లినా మంత్రి భూకబ్జాలపైనే ప్రజలు తిరగబడుతున్నారన్నారు. మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింహగౌడ్, అనంతలక్ష్మి, రాజుయాదవ్, రేసు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకుంటే రాజకీయ సన్యాసం

ఏడాదిలో మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ ఉప్పర్‌పల్లి, అంతాయపల్లి, మదాయిపల్లి, సింగాయిపల్లి, హకీంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల సమస్య గుర్తులేదా..?

నాలుగేళ్లుగా బోడుప్పల్ కార్పొరేషన్‌లో వక్ఫ్‌బోర్డు భూముల సమస్యలను నాలుగేళ్లుగా పట్టించుకోలేదని, ఇప్పుడు వారి కష్టం గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. మల్లారెడ్డి ఓటమి భయంతోనే జేఏసీ ప్రతినిధులను పిలిపించుకొని మంత్రి కేటీఆర్‌తో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. బీఆర్‌ఎస్ భూటకపు హామీలను నమ్మవద్దని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వక్ఫ్ భూముల సమస్యను పరిష్కరిస్తామన్నారు.



బోడుప్పల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



తూంకుంట మున్సిపాలిటీలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్

కాంగ్రెస్‌లో భారీ చేరికలు..

శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో బీఆర్‌ఎస్ నుంచి భారీగా చేరికలు జరిగాయి. రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు కంటం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 400 మందికి మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. టీపీసీసీ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు కిశోర్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే.. మేడ్చల్ ప్రజలు



జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య జన్మదిన వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి

మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ జోన్ బృందం: సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను చూసి, మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన తనతోనే ఉండేందుకు మేడ్చల్ ప్రజలు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో, కీసర మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగి మల్లేశ్, నాయకులు, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతశ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు వార్డులకు చెందిన యువకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అంతకుముందు జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య జన్మదిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డి సమక్షంలో..

మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి, రాజబొల్లారం గ్రామాలకు చెందిన పలువురు, శామీర్‌పేట్ మండల సెంట్రింగ్ సంఘం కార్మికులు, ఎరుకల సంఘం నాయకులు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో, మేడ్చల్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని, బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని భావించి పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారని, మరోమారు గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో మేడ్చల్, శామీర్‌పేట్ మండలాల పార్టీ అధ్యక్షులు దయానంద్‌యాదవ్, సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ మండల ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ శైలజ, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు విజయానంద్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపసర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం, మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు.



జవహర్‌నగర్‌లో పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న గౌడవెళ్లి నాయకులు

సోమవారం రాంపల్లిదాయర గ్రామంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. పేదల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఓట్లు వేసి మరోసారి గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నేతలంతా కలిసి కట్టుగా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయండి

- నేరుగా కలిసేందుకూ అవకాశం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులను భారత ఎన్నికల కమిషన్, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయడంతో పాటు నేరుగా కలవవచ్చని ఆయన సూచించారు. జిల్లాలోని మేడ్చల్ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్‌గా ఎస్.కె.జైన్ ఫోన్:(73370 47775), మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్‌గా పూర్వాగార్గ్ ఫోన్: (73370 47776), కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్‌గా అమన్ మిట్టల్ ఫోన్: (73370 47778)లను నియమించారని ఆయన తెలిపారు.

ఉప్పల్ పీఎస్ వద్ద కాంగ్రెస్ నేతల ఆందోళన

ఉప్పల్: ఉప్పల్ సీఐ శ్రవణ్‌కుమార్ పండగ పూట అర్ధరాత్రి స్థానికంగా ఉండే యువకుడిని చితక బాదడాన్ని నిరసిస్తూ ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. ఉప్పల్ దేవేందర్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ అలీం రెండుసార్లు కాలనీ అధ్యక్షుడిగా పనిచేశాడు. కాంగ్రెస్‌లో ఉన్నందుకు కొన్నాళ్లుగా ఇతర పార్టీల వారు అనేక ఇబ్బందులు పెడుతున్నారని అలీం ఆరోపించాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఉప్పల్ సీఐ శ్రవణ్‌కుమార్ ఎస్‌ఐతో కలిసి ఇంట్లోకి వచ్చి భూతులు తిట్టాడని, ఎందుకు తిడుతున్నావని ప్రశ్నిస్తే ఫోన్ లాక్కొని చితకబాదాడని ఆరోపించారు. ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డితో పాటు వందలాది మంది కార్యకర్తలు ఉప్పల్ స్టేషన్‌కు చేరుకొని బాధితుడికి న్యాయం చేయాలని, సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐపై రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు.

సిఐ శ్రవణ్ కుమార్ వివరణ

అలీంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, ఆయన్ను కొట్టాల్సిన అవసరం లేదన్నాడు. దేవేందర్ నగర్ కాలనీలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం సేవించి వచ్చి అతనే హంగామా సృష్టించాడన్నారు.

లోలోన మంతనాలు.. పసందైన ప్రలోభాలు

- గెలుపునకు దోహదపడే ప్రతి అంశంపై దృష్టి
- సంఘాలకు హామీలు.. గంపగుత్తా ఓట్ల కోసం..
- బల్క్ ఓట్లపై నాయకుల ప్రత్యేక నజర్
- మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్‌లో జోరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సంఘాలకు సామాజిక భవనాలు, ఇతర ప్రాంతాలకు రోడ్లు, మరమ్మతులు సమకూరుస్తామనే హామీలతో పాటు అవసరమైన నిధుల మళ్లింపు కూడా చేపడుతూ ఓట్లను గంపగుత్తగా తమకు మళ్లేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇంటింటి ప్రచారంతో పాటు వ్యూహాలకు పదును పెడుతున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో.. ఓటమి తమ దరిచేరనివ్వకుండా విజయానికి దోహదపడే అన్ని అంశాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అవతలి పక్షం నుంచి నేతలు, కార్యకర్తలను రప్పించేందుకు అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. దీనికి తోడు తమ వారు జారిపోకుండా కాపాడుకోవడం అతి కష్టంగా మారింది. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ ఫిరాయింపులు పెరుగుతుండటంతో అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్రచారం కంటే.. లోలోన మంతనాలే ఎక్కువగా జరుగుతున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.



అభ్యర్థుల వ్యూహాలు.. ప్రతి వ్యూహాలు..

సంఘాలకు సామాజిక భవనాలు, ఇతర ప్రాంతాలకు రోడ్లు, మరమ్మతులు సమకూర్చుతామనే హామీలతో పాటు అవసరమైన నిధుల మళ్లింపు కూడా చేపడుతూ ఓట్లను గంపగుత్తగా తమకు మళ్లేలా పాట్లు పడుతున్నారు. కొన్ని ప్రధాన వర్గాలను ఆకర్షించేలా ఒకరు మందు విందును ఏర్పాటు చేస్తే.. మరొకరు విందు సమావేశం నిర్వహిస్తున్నారు. అధికారులు కన్ను పడకుండా ఉత్తుత్తి పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, ఇతర కార్యక్రమాల పేరిట వ్యవసాయ క్షేత్రాల్లో వేడుకను ఏర్పాటు చేసి మందు, విందులను అందిస్తున్నారు. దీంతో ఈ రోజు ఒక పార్టీలో కనిపించిన వారు మరుసటి రోజు మరో పార్టీలో దర్శనమిస్తున్నారు. సీనియర్లు పార్టీ మారుతుండగా, క్షేత్రస్థాయి కార్యకర్తలైతే ఏ పార్టీలో కొనసాగుతున్నారనేది అంతు చిక్కడం లేదు.

పార్టీల్లోని అసంతృప్తులపై కన్ను..

కొందరు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇతర పార్టీ అసంతృప్తి నేతలపై కన్నేశారు. రహస్యంగా వారిని కలిసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తమ పార్టీలోకి రావాలని కోరుతున్నారు. ఒకవేళ పార్టీలోకి రావడం కుదరదంటే అంతర్గతంగా మద్దతివ్వాలని, క్రాస్ ఓటింగ్‌కు సహకరిస్తే కావాల్సిన సాయం చేస్తామని హామీలిస్తున్నారు. అవసరమైతే ప్రత్యేకంగా ప్యాకేజీలు అందిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావటంతో మరిన్ని వ్యూహాలను అమలు చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఉన్నారు. దీనికి తోడు ద్వితీయ శ్రేణి నుంచి దిగువస్థాయి వరకు ఉన్న ప్రధాన నాయకులు, ముఖ్యమైన కార్యకర్తలకు ప్రచారం చేసేందుకు వాహనాలను సమకూర్చుతున్నారు. కొన్ని చోట్ల ప్రధాన వర్గాలను ఆకట్టుకునేలా నగదు ఇస్తామని, ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపిస్తామని, ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా భారీ బహుమతులను పంపిస్తామన్న ప్రచారం జోరందుకుంటోంది. ప్రధానంగా మహిళా, యువజన సంఘాలు, వెల్ఫేర్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్, కాలనీ కమిటీలు, ఇతర ఓట్లను ప్రభావితం చేసే వారిపై పార్టీలు దృష్టి సారించాయి. అభ్యర్థుల గెలుపోటములపై ఇవి ఎంతమేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఘనంగా సదర్ వేడుకలు



పూడూర్‌లో సదర్ వేడుకల్లో గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలో సదర్ వేడుకలు ఘనంగా జరిగాయి. దీపావళి సందర్భంగా యాదవులు గ్రామంలో సదర్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. యాదవులు తమ పాడిపశువులకు, దున్నపోతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం, గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఉపసర్పంచ్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ వేడుకల్లో భాగంగా యాదవులు దున్నపోతులను అందంగా ముస్తాబు చేసి గ్రామంలోని మల్లన్న ఆలయంలో పూజల అనంతరం గ్రామంలో ఊరేగించారు. వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి సోదరుడు గోపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు దయానంద్‌యాదవ్, పెద్ద గొల్ల ఎల్లంబాయి యాదవులు దున్నపోతులను సత్కరించారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకలు మధుకర్‌యాదవ్, శంకర్, నారెడ్డి శ్రీధర్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్రీకాంత్, శశికుమార్ యాదవ్, హన్మంత్‌రెడ్డి, మాణిక్యం, గ్రామ నాయకులు పోచయ్య, సత్తిరెడ్డి, కోల్ల వెంకటేశ్, దుందిగళ్ల శంకర్, రేగు నాగేశ్, సీరుడి దేవేందర్, బాబు, నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తాలో..

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో సదర్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిచారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ నరేశ్‌యాదవ్, యాదవ సంఘం అధ్యక్షుడు అధ్యక్షుడు ఆర్.యాదగిరియాదవ్, మాజీ అధ్యక్షుడు రామకష్ణయాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ హాజరై బహుమతులు ప్రధానం చేశారు. జంగయ్యయాదవ్, వీరేందర్‌యాదవ్, ముత్యాలుయాదవ్, శంకరయ్యయాదవ్, పరమేశ్‌యాదవ్, నర్సింహ్మయాదవ్, రాంచందర్, రమేశ్ యాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో సదర్ ర్యాలీలో చైర్ పర్సన్ పావనీజంగయ్య యాదవులు

మల్కాజిగిరిలో 8 మంది నామినేషన్ల తిరస్కరణ

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఎనిమిది మంది నామినేషన్లను తిరస్కరించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు, బీజేపీ అభ్యర్థి రాంచందర్‌రావులతో పాటు 38 మంది నామినేషన్లను ఆమోదించగా, భారతీయ జనతా పార్టీ పేరుతో దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, ప్రసన్నకుమారి, రామిశెట్టి రామక్రిష్ణ, దండుగుల వెంకటేష్, ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీకి చెందిన శ్రవణ్‌కుమార్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్‌కు చెందిన గోగిరెడ్డి అంజనీదేవి, స్వతంత్ర అభ్యర్థి మహ్మద్ సలీమ్, రవిచంద్ర నామినేషన్లను తిరస్కరించారు.

ఆర్థిక సాయం

గౌతంనగర్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వై.కే.రాకేష్ కుటుంబానికి గౌతంనగర్ డివిజన్ హనుమాన్‌పేట్‌కు చెందిన ది సిటిజన్ బ్యాంక్ కో-ఆపరేటివ్ సొసైటీ మేనేజర్ ఎస్.ఎమ్ ఫీరాన్ సోమవారం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏవీ.స్వామి, రాజేశ్వర్‌రావు, సిబ్బంది అనిల్, ప్రియాంక, దినేష్, హర్ష తదితరులు ఉన్నారు.

మార్పు కోసం బీజేపీని గెలిపించండి

అల్వాల్: రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరిలో మార్పు కోసం భారతీయ జనతాపార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన ఎన్నిక ప్రచారం నిర్వహించారు.

ఉప్పల్‌లో మూడు నామినేషన్ల తిరస్కరణ

ఉప్పల్: నియోజవర్గంలో 37 మంది అభ్యర్థులు 64 నామినేషన్లు వేశారు. అందులో చాలా వరకు స్వతంత్ర అభ్యర్థులు ఉండగా మరి కొందరు రిజిస్టర్డ్ పార్టీలు, నేషనల్, స్థానిక పార్టీల అభ్యర్థులున్నారు. 37 మంది అభ్యర్థుల్లో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురైనట్లు సోమవారం ఎన్నికల అధికారులు ప్రకటించారు. జైమహాభారత్ పార్టీ అభ్యర్థి అంప్రయాని దీప్తి, అనిల్తా మాజా, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ కె.సురేష్, తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అభ్యర్థి ఎం.మల్లేషం నామినేషన్లను తిరస్కరించారు.